క్లుప్తంగా

పరీక్షలకు 634 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 634 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 2,014 మందికి గానూ 1,380 హాజరయ్యారని, 634 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసులు


శ్రీనివాసులు

మనుబోలు: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య పదిరోజుల పాటు సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో వెంకటాచలం తహసీల్దార్ శ్రీనివాసులును ఇన్‌చార్జిగా కలెక్టర్ నియమించారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మనుబోలు: పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జట్ల కొండూరు గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ అన్నారు. కుడితిపల్లి గ్రామంలో గురువారం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దాని స్థానంలో విద్యుత్ శాఖ సహకారంతో కొత్తది ఏర్పాటు చేయించారు.

వాటర్ కూలర్ బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయానికి తిరుపతి ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.లేఖామీనన్ రూ.60 వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఎస్‌బీఐ సిబ్బంది శ్రీనివాసరావు, శేషగిరి పాల్గొన్నారు.

ఎన్జీ రంగాకు ఘన నివాళి



పొదలకూరు: స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం ఎన్జీ రంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నరాజేష్ మాట్లాడుతూ ఎన్జీ రంగా రైతుల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటు పడినట్టు తెలిపారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేఖ, హజీనాభాను, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో వినతుల స్వీకరణ


గుండాలమ్మపాళెం గ్రామసభలో వినతుల స్వీకరణ

కొడవలూరు: రీసర్వేలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రీసర్వే డీటీ అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో రీసర్వే సమస్యలపై గురువారం గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో తలెత్తిన సమస్యలను మాత్రమే 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. మండల సర్వేయర్ శ్రీలత, సర్పంచ్ కోటంరెడ్డి దివ్య, స్థానిక నేత కె.అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల ఆవరణలో ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్ల ఎంపికలు గురువారం నిర్వహించారు. 288 మంది విద్యార్థులు పాల్గొనగా, 30 మందిని ఎంపిక చేశారు. నెల్లూరు 10ఏ నావెల్ యూనిట్ ఆఫీసర్లు బి.సుధాకర్‌రావు, వెంకటేష్ రాథోడ్‌ల ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ విద్యార్థులను అభినందించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌రావు, ఎన్‌సీసీ కేర్ టేకర్ సీహెచ్.సతీష్, ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి బ్రేకులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడం కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించారు. అనేక భవన నిర్మాణాలు పూర్తయి ప్రజలు ఉపయోపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను ఆపేసింది. అసంపూర్తి పనులపై దృష్టి సారించడం లేదు.

- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిపై నీలినీడలు
- ఆగిపోయిన నిర్మాణాలు
- పునాదులకే పరిమితమైన వైనం
- హెల్త్ క్లినిక్‌లకు భవనాలు లేవు
- కొత్త భవనాల మంజూరు నిల్


ముత్తుకూరులో ఆగిపోయిన హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం

ముత్తుకూరు: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రజల కోసం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లతో పాలనను పల్లె ముంగిటకు చేర్చింది. వాటి కోసం భవనాల నిర్మాణం చేపట్టింది. ఈ వ్యవస్థలన్నీ నేడు ఆదరణ కోల్పోతున్నాయి. పరిపాలన, వైద్యం తదితరాలను ప్రజలకు చేరువ చేయాలని చేసిన సంకల్పం గాలిలో దీపంగా మారింది. వ్యవసాయపరంగా అన్ని రకాల సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలు రైతు సేవా కేంద్రాలుగా మారాయి. నూతన భవనాలు మంజూరు లేక ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి. వైద్యాన్ని పేదల ఇంటి ముంగిటకు చేర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లను సైతం పంచాయతీ గదులు, అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు.

ఆ ప్రస్తావనే లేదు

మండలంలో 16 సచివాలయాలున్నాయి. గత ప్రభుత్వ పాలనలో దొరువులపాళెంలో సుమారు రూ.80 లక్షలు వ్యయం చేసి సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా పంటపాళెంలో సుమారు రూ.46 లక్షల వ్యయంతో ఆర్బీకేతోపాటు హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. ముత్తుకూరు సచివాలయ భవనం ఏర్పాటైనా ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతన భవనాల మంజూరు ప్రస్తావన చేసే పరిస్థితి కనిపించడంలేదు. ఆర్బీకే (ఆర్ఎస్‌కే)లను ప్రస్తుతం సచివాలయ భవనాల్లో ఓ మూలన కొనసాగిస్తున్నారు.

సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయాలి



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం బలోపేతం చేయాలి. ప్రజల కోసం ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాలు సమకూర్చాలి. తగిన సిబ్బందిని నియమించి అత్యుత్తమ సేవలందించాలి.

– బందెల వెంకటరమణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు

నూతన భవనాలు మంజూరు చేయాలి



గత ప్రభుత్వం ప్రారంభించిన సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు అవసరమైన భవన వసతి లేదు. వీటిని ఇరుకు గదుల్లో నిర్వహించాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నూతన భవనాలు మంజూరు చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– గండవరం సుగుణ, ఎంపీపీ, ముత్తుకూరు


ముత్తుకూరులో పునాదులకే పరిమితమైన ఆర్బీకే


పంటపాళెంలో గత ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ క్లినిక్

ఆదాల ఆత్మీయ పలకరింపు

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం మండలంలోని జగదేవిపేటకు వచ్చారు. తన పెద్దమ్మ జక్కా కామేశ్వరమ్మ నివాసానికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ముత్తుకూరు: మండలంలోని పంటపాళెంలో ఇద్దరు వ్యక్తుల నుంచి ఎక్సైజ్ అధికారులు గురువారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గద్దె త్రివిక్రమ్ అనే వ్యక్తి 30 బాటిళ్లు, పవన్ అనే వ్యక్తి 30 బాటిళ్లు కలిగి ఉండగా పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వై.వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ కాలేషావలీ వెల్లడించారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ

పొదలకూరు: స్థానిక నిమ్మ మార్కెట్ యార్డులో ఉద్యాన శాఖ గురువారం నిర్వహించిన రైతు శిక్షణా శిబిరంలో పాల్గొన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం నెల్లూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులురెడ్డి రైతులకు చీడపీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, పొదలకూరు ఉద్యానాధికారి ఈ.ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

కనుపూరు కాలువకు నీటి విడుదల

పొదలకూరు: సంగం ఆనకట్ట నుంచి సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలకు సాగునీటిని అందించే కనుపూరు కాలువకు గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


వైవీ సంజన | రేష్మ | దీక్ష | మహేశ్వరి | దేవీప్రియ

వెంకటాచలం: గుంటూరు జిల్లా యనమదలలో ఈనెల 9 నుంచి 11 తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ – 17 బేస్‌బాల్ పోటీలకు మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న వైవీ సంజన, కె.రేష్మ, 9 తరగతి చదువుతున్న దీక్ష, తిరుపతి జిల్లా మంగళంలో 9 నుంచి 11 తేదీ వరకు జరగనున్న అండర్ – 14 బేస్‌బాల్ పోటీలకు 7 తరగతి విద్యార్థినులు మహేశ్వరి, దేవిప్రియ ఎంపికయ్యారు. వారిని పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, పీడీ షేక్ షబిక అభినందించారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

కోవూరు: కోవూరు ఎక్సైజ్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, అల్లూరు, విడవలూరు మండలాల్లో అనధికార మద్యం విక్రయాలపై ముమ్మర దాడులు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కిశోర్ తెలిపారు. ఈ మేరకు ఆయన కోవూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గడిచిన రెండు రోజుల్లో ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశామని, 14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఎక్కడైనా అనధికార మద్యం విక్రయాలు జరుగుతుంటే 94409 02524 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా

పొదలకూరు: పొదలకూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ వద్ద కడియాల లక్ష్మి అనే మద్యం షాపు లైసెన్స్ హోల్డర్ గురువారం ధర్నాకు దిగారు. షాపు షిఫ్టింగ్‌కు ఎక్సైజ్ సీఐ అనుమతి ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమకు మండలంలో 154 నంబర్ షాపు లాటరీలో వచ్చినట్టు తెలిపారు. ముందుగా సూరాయపాళెం గ్రామంలో షాపును ఏర్పాటు చేశామని, అక్కడ వ్యాపారం జరగక నష్టపోతున్నట్టు చెప్పారు. దుకాణాన్ని పొదలకూరు పట్టణంలో ఏర్పాటు చేసుకునేందుకు షిఫ్టింగ్ కింద సీఐను లైసెన్స్ అడిగితే ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నట్టు ఆరోపించారు.


ధర్నా చేస్తున్న లక్ష్మి, మద్దతుదారులు

బాబా మందిరంలో విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు జరిగాయి. రాత్రి స్వామికి పల్లకి సేవ నిర్వహించారు.



- మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ సాయిబాబా విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. పాపన పెంచల నరసయ్య, లక్ష్మమ్మ దంపతులు, వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యహరించారు.

టీడీపీలో రెండు వర్గాల ఘర్షణ

- పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

కొడవలూరు: మండలంలోని రామన్నపాళేనికి చెందిన టీడీపీ నేతలు డేగా దయాకర్‌రెడ్డి, కాకి శ్రీనివాసులు వర్గాల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకొంది. దయాకర్‌రెడ్డి తొలి నుంచి టీడీపీలో కొనసాగుతుండగా, శ్రీనివాసులు ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. వీరి మధ్య అంతర్గతంగా విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శివాయి స్థలంలో టీడీపీ కార్యాలయ పనులు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రీనివాసులు సతీమణి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. అదే పార్టీలో ఉన్నా తమ ప్రమేయం లేకుండా పార్టీ కార్యాలయ పనులు చేపడుతుండడంతో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకొంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి దయాకర్‌రెడ్డి వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై అవతలి వర్గీయులు చేయి చేసుకున్నారు. దీంతో కోపోద్రిక్తులైన దయాకర్‌రెడ్డి వర్గీయులు శ్రీనివాసులు తమ్ముడిపై దాడి చేశారు. ఆగ్రహించిన శ్రీనివాసులు వర్గీయులు దయాకర్‌రెడ్డిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. దీంతో రెండు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై విచారణ చేస్తున్న ఎస్సై కోటిరెడ్డి తెలిపారు.

ప్రసన్నకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి బుచ్చి నగర వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ రసూల్‌తో పాటు పలువురు నాయకులు గురువారం అభినందనలు తెలియజేశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్క అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవ, పఠాన్ దావూద్, పఠాన్ వాహిద్, షేక్ కరిముల్లా, షేక్ నవాజ్, చంటి ఉన్నారు.

జామ తోట దహనం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం


తోట వద్ద రైతు నరహరి

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు ఎస్సీ కాలనీకు చెందిన రైతు తైవాన్ జామ తోటను గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతు కూకట్ల నరహరి గురువారం తోట వద్దకెళ్లి కన్నీటి పర్యంతమయ్యాడు. రెండేళ్ల క్రితం 1.5 ఎకరాల్లో 2,500 తైవాన్ జామ మొక్కలను నాటినట్టు రైతు పేర్కొన్నాడు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తోటను తగులబెట్టినట్టుగా అనుమానం ఉందన్నాడు. రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వచ్చిందని వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారి ఉమ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని నాగమాంబపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను కోవూరు ఐసీడీఎస్ అధికారి ఉమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులకు అందించి, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.


కొడవలూరు: రేగడిచెలికలో చిన్నారి హైట్‌ను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

- కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక, రాచర్లపాడు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ గురువారం తనిఖీ చేశారు. చిన్నారుల ఎత్తు, బరువులను కొలిచి రికార్డులతో సరిపోల్చి చూశారు. పౌష్టికాహార వాస్తవ నిల్వలు, రికార్డుల్లోని నిల్వలు కచ్చితంగా ఉన్నాయా.. లేదా? అని పరిశీలించారు. అనంతరం రాచర్లపాడులో తల్లులతో సమావేశం నిర్వహించి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషకాహారంపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కార్యకర్త టి.రాజేశ్వరి, సహాయకురాలు డి.సుభాషిణి ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు కోవూరు విద్యార్థులు

కోవూరు : మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆర్చరీ విభాగంలో కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎ.సాత్విక్, ఎ.ప్రీతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో వారికి పాఠశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి పాల్గొని, ఇద్దరు విద్యార్థులకు రూ.5 వేల చొప్పన ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.


విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని దామరమడుగు గ్రామంలో జొన్నవాడ కో-లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు అహ్మద్‌బాబు, వినయ్‌కుమార్ మాట్లాడారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీల్లో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- తోటపల్లిగూడూరు: కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ జరిగింది. వైద్యాధికారి నరేంద్ర మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి స్క్రీనింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రమేష్, హెల్త్ హెడ్యుకేటర్ ఉమర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు కావ్య, జనార్దన్ మాట్లాడుతూ కేన్సర్ పట్ల సందేహాలు వీడి వైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఈఓ కోటేష్, హెచ్ఎస్‌లు రజియ, సురేంద్ర, ఎస్ఎన్ స్వర్ణలత, ఏఎన్ఎం సుకన్య, హెచ్ఏలు అంకిరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


కోడూరులో ర్యాలీ


కొడవలూరు : యల్లాయపాళెంలో..